క్లుప్తంగా

సోదర భావానికి ప్రతీక రాఖీపౌర్ణమి



వేడుకుల్లో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురంలోని బ్రహ్మకుమారి సంస్థలో బుధవారం రాఖీపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ వైజాగ్ ఇన్‌చార్జి శివలీల మాట్లాడుతూ అక్కాచెల్లెల్లు తమ సోదరులు ఆరోగ్యంగా,ఆనందంగా ఉండాలని రక్ష బంధన్ కడతారన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ గాజువాక ఇన్‌చార్జి మణి,శ్రీహరిపురం బ్రాంచి ఇన్‌చార్జి బి.కె.సింధు,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రవల్లికయాదవ్‌కు అభినందన



ప్రవల్లికయాదవ్‌కు చెక్ అందిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ ప్రవల్లికయాదవ్ ఉమెన్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 3 నుంచి 6వ తేది వరకు ఫస్ట్ బిహార్ కప్ యూత్ మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రవల్లిక యాదవ్ పాల్గొంది. ఉమెన్ 80 కేజీల విభాగంలో అద్భుత ప్రతిభ చూపి బంగారు పతకం సొంతం చేసుకుంది. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్లు ప్రవల్లికకు అభినందనలు తెలిపారు.

పేదరిక నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య: పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరో పావర్టీ పీ- 4 కార్యక్రమంలో స్వచ్ఛంద్ఛందగా పాల్గొని మార్గదర్శకులుగా నిలువాలని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసలోని వేమన మందిరంలో సచివాలయ సిబ్బందికి పీ-4పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటుతో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు జోన్-5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ పీ 4 తో పాటు ప్రభుత్వ పథకాల పై విషయాలపై అవగాహన పెంచుకోవాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సమావేశంలో యాముజాల తిరుమలరావు, విశాఖ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకు మహంతి చంద్రశేఖర్, చల్లా మంజుల, అశోక్ కుమార్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ

- రేపు వరలక్ష్మీ వ్రతం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పూలు, పండ్లకు పెరిగిన గిరాకీ



వివిధ రకాల చామంతి పూలు



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

విశాఖ విద్య: మార్కెట్‌కు శ్రావణ శోభ వచ్చింది. ప్రతీ ఇంటా భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకునే శ్రావణ మాసం కావడంతో పూలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలకు గిరాకీ పెరిగింది. తాత్కాలిక దుకాణాలు సైతం వెలిశాయి. కొనుగోలు దారులతో ఎన్‌ఏడీ ఏరియా రద్దీగా మారింది. శ్రావణ మాసంలో అత్యంత ప్రీతిపాత్రమైన శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతం కూడా రావడంతో పూలు, పండ్లు ధరలను ఒక్కసారిగా పెంచేశారు. నిన్న , మొన్నటి వరకు కేజీ చామంతి పూలు రూ.400 పలకగా, బుధవారం రోజున మార్కెట్‌లో రూ.700కు విక్రయించారు.రైతు బజార్లలో సైతం కిలో చామంతి పూలు రూ.600 ధర పలికింది. రూ.50 పెడితేనే కాసిన్ని పూలుకూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. రైతు బజారులో మూర మల్లెపూలు,సన్నజాజిపూలను రూ.100కు విక్రయించారు. బయట మార్కెట్‌లో వీటి ధర రెట్టింపు పలికింది. శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మి వ్రతాన్ని ప్రతీ ఇంటా భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పూజకు అవసరమైన పూలు, పండ్లు, ఇతర సరుకుల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ఎన్‌ఏడీ సెంటర్ సమీపంలోని బాజీ జంక్షన్‌లో పూలు, పండ్లు దుకాణాలు విరివిగా వెలిసాయి. ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వద్ద గల సంతలో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి పూలు, పండ్లు విక్రయిస్తున్నారు.



పండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధం చేసిన పూలు

ఘనంగా దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు





మేరీమాత స్వరూపం తేరు వద్ద జెండా ఎగురవేస్తున్న ఫాదర్లు, నవదిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని క్యాథడ్రల్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో 125 వసంతాల దేవమాత మోక్షరోపణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం నవ దినాల ప్రార్థనలు (నొవీనా) నిర్వహించారు. ఖమ్మం డయోసిస్‌కు చెందిన రెవరెండ్ ఫాదర్ సూరేపల్లి ఐజక్ ముఖ్య అతిథిగా హాజరై 125 వత్సరాల పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజలు చేశారు. పరిశుద్ధ బైబిల్‌లో మరియమాతకు ఉన్న ప్రాముఖ్యతను, జూబ్లీ ఉత్సవాల చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. బెలూన్లతో తయారు చేసిన భారీ జపమాలను ఫాదర్లు గాలిలో ఎగురవేశారు. సాయంత్రం దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీవ్‌గుర్తు వీధి, రొసిలియన్ తదితర ప్రాంతాల్లో పల్లకీ ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ పోషకాలు



గొల్లకంచరపాలెంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుమిత



తుమ్మడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో..

కంచరపాలెం: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణపోషకాలు లభిస్తాయని ఆర్పీపేట అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ జి. మధుమిత పేర్కొన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్ల కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో డాక్టర్ మధుమిత మాట్లాడారు. నవజాత శిశువుల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమైనవి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, హెచ్‌వీ జె.భారతి, ఏఎన్‌ఎం బి.భారతి, బి.పైడితల్లి, స్వాతి,మహిళా పోలీస్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 57వ వార్డు తుమ్మడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్, ఐసీడీఎస్ సంయుక్తంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను వేడుకగా నిర్వహించారు.

తల్లిదండ్రుల చెంతకు యువతి

మల్కాపురం: మనస్థాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువతిని రెండు గంటల వ్యవధిలోనే మల్కాపురం పోలీసులు పట్టుకుని, తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలివి.. శ్రీహరిపురం ప్రాంతంలో నివసిస్తున్న 18ఏళ్ల యువతి డిప్లొమా చదువుతోంది. మంగళవారం సాయంత్రం చదువు విషయంలో చిన్న వివాదం చోటు చేసుకోవడంతో తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తమ కుమార్తె ఇంటివద్ద కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు మంగళవారం సాయంత్రం మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐ గొలగాని అప్పారావు తన బృందంతో విచారణ చేపట్టారు. ఆ యువతి విశాఖ రైల్వేస్టేషన్ వద్ద రైలు ఎక్కేందుకు సిద్ధంగా ఉందని తెలుసుకుని వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి రెండు గంటల వ్యవధిలోనే ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు సీఐకు కృతజ్ఞతలను తెలిపారు.

షాపులు కట్టారు.. వసతులు మరిచారు!



మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలో మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ పేరిట జీవీఎంసీ అధికారులు సుమారు 60 షాపులు నిర్మించారు. అయితే మౌలిక వసతులైన మరుగుదొడ్లు లేవు,మంచినీటి సదుపాయం కల్పించలేదు. షాపింగ్ కాంప్లెక్స్‌కు రక్షణ గేటు లేదు. అత్యవసరమైతే దూరంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రక్షణ గేటు లేకపోవటంతో షాపుల ఆవరణలోకి పశువులు,వీధి కుక్కల చేరి అపరిశుభ్రం చేస్తున్నాయి. కనీస మౌలిక వసతులు కల్పించాలని వ్యాపారులు పలు మార్లు అధికారులు,పాలకులకు వినతులు అందించారు. ఇప్పటికైనా స్పందించి వసతులు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

జాకబ్ రాజుకు పురస్కారం



పురస్కారంతో జాకబ్ రాజు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతినగర్‌కు చెందిన విశ్రాంత ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రముఖ చిత్రకారుడు జాకబ్‌రాజు భారత్ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ 2025కు గాను ఈ అవార్డు అందించింది. జాకబ్ రాజు కిషోర్ ఫైన్ ఆర్ట్స్ అండ్ స్టూడియో సంస్థను నిర్వహిస్తున్నారు. చిత్రకళలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చారని ఆయన తెలిపారు. గతంలోనూ పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నానన్నారు.

పది కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న వ్యక్తులతో ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశానవాటిక సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. విశ్వసనీయ సమాచారం మేరకు గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక భాగం విద్యానగర్‌లో ఎస్ఐ అప్పలనాయుడు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన గుడియట్టం, ధర్మపురి జిల్లా ప్రాంతాలకు చెందిన అశోక్, ప్రభాకర్ బ్యాగులను తనిఖీ చేయగా రెండు బ్యాగుల్లో 10 కిలోల గంజాయి పట్టుబడింది. వీరు ఒడిశా పాడువ ఏజెన్సీ ప్రాంతం నుంచి తమిళనాడుకు గంజాయిని తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. గోపాలపట్నం సీఐ ఎన్‌వి ప్రభాకర్ పర్యవేక్షణలో గంజాయిని స్వాధీనం చేసుకుని, వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



ఉత్సాహంగా తలపడుతున్న క్రీడాకారులు

గాజువాక: ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రమశిక్షణ, అంకిత భావం, పట్టుదలతో క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ద్వారకానాథ్, డాక్టర్ అంకమ్మ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'గైస్' విద్యార్థినుల ప్రతిభ



ఉద్యోగాలు పొందిన విద్యార్థినులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన బిర్లా పెయింట్స్, ఒపస్ పెయింట్స్‌కు నిర్వహించిన ఉద్యోగ నియామక ఇంటర్వ్యూల్లో వివిధ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన నలుగురు బాలికలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఎస్.చంద్రజ్యోతి (పెట్రో కెమికల్స్), ఎం.చరిష్మా (పెట్రో కెమికల్స్), ఎస్.కోమలి(కెమికల్ ఇంజనీరింగ్), కె.ప్రతిభ(ఆయిల్ టెక్నాలజీ)లకు రూ.3.3 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు కంపెనీ పంపించిన ఉత్తర్వులను బుధవారం విద్యార్థినులకు ప్రిన్సిపాల్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థినులను వివిధ విభాగాధిపతులు సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డాక్టర్ దామోదర్, ఎం.మహాలక్ష్మి, డాక్టర్ ఎం.విజయలక్ష్మి, టీపీవో కేబీవీఎస్ఎస్ కుమార్ అభినందించారు.

సిరులతల్లికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 13వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

మల్కాపురం: తన మాట భర్త వినలేదన్న కోపంతో ఓ వివాహిత ఇద్దరు పిల్లలతో అదృశ్యం అయింది. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు... 60వ వార్డు కోరమాండల్ సమీపంలో జాన్ అనే వ్యక్తి భార్య దేవి,ఏడేళ్ల కుమార్తె,ఐదేళ్ల కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. జాన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడంతో హైదరాబాద్ వెళ్లాల్సివచ్చింది.దీంతో భార్య దేవికి విషయాన్ని వివరించాడు. అలాగైతే తనతో పాటు పిల్లలను కూడా హైదరాబాద్ తీసుకు వెళ్లాలని డిమాండ్ చేసింది. రెండు నెలల పనిపై వెళ్తున్నానని,పిల్లల చదువులు పోతాయి ఇంటి వద్ద ఉండమని నచ్చచెప్పాడు. నా మాట కాదని నువ్వు హైదరాబాద్ వెళ్తే నేనే పిల్లలను తీసుకుని ఎక్కడికైనా వెళ్లిపోతానని భర్తను హెచ్చరించింది. భార్య మాట పట్టించుకోని జాన్ మంగళవారం హైదారాబాద్ వెళ్లాడు.దీంతో మనస్తాపానికి గురైన దేవి అప్పుడే స్కూల్ నుంచి వచ్చిన తన ఇద్దరి పిల్లలను తీసుకుని అదృశ్యం అయింది. దీంతో మల్కాపురం పోలీసులకు భర్త జాన్ ఫిర్యాదు చేశాడు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం

మద్దిలపాలెం: బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కోర్సుకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని తెలిపారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కోర్సుకు అవసరమైన వ్యవస్థను నిర్మించే దిశగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చే సమయానికి క్వాంటమ్ రంగంలోని సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ప్రత్యక్షంగా పాల్గొని ఆచార్యులకు శిక్షణ అందిస్తారన్నారు.

యువజన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: అంతర్జాతీయ యువజన దినోత్సవం – 2025 ఉత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 12న ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఇంటర్ ఫెయిత్ డైలాగ్, యూత్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంతో కొనసాగనుంది. కార్యక్రమాన్ని యోస్ వి కేన్ యువజన సంస్థ(విశాఖపట్నం), ఆర్థిక శాస్త్ర విభాగం, ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్(భారత ప్రభుత్వం), ఏయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ యూనిస్, ప్రొఫెసర్ డి.ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు రాఖీ శోభ









మార్కెట్ రక్షాబంధన్ శోభను సంతరించుకుంది. ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం పరిసర ప్రాంతాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ వెరైటీల్లో కొత్త రకం రాఖీలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పెద్ద దుకాణాలతో పాటు రహదారులు, పుట్‌పాత్‌లపై చిన్న స్టాళ్లు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ ఏడాది వ్యాపారులు రాఖీల ధరలు కాస్త ఎక్కువగా పెంచి విక్రయిస్తున్నారు. అక్కచెల్లెమ్మలు తమ అన్నదమ్ముల చేతికి కట్టేందుకు మార్కెట్‌లో నచ్చిన రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. రాఖీలతోపాటు మిఠాయి దుకాణాలు, గిఫ్ట్ షాపులు సందడిగా కనిపిస్తున్నాయి.

– కంచరపాలెం